ఋణమాఫీ డబ్బులు వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలి.



4లో

తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT
ఎడిటర్: బక్క రవీందర్
బుధవారం 14, ఆగస్టు 2024

సమస్య ఏదైనా
దాని వెనుక ఎవరున్నా...
నిజాన్ని నిర్భయంగా చూపిస్తాం
మీకు తెలిసిన ప్రజల సమస్యలు
మాకు తెలియజేయండి.
ఇండిపెండెంట్ జర్నలిజానికి
వేదిక.. మీ డైలీ రిపోర్ట్
ఫోన్ నెంబర్
8501919707



# కాగ్నిజెంట్ విస్తరణకు ముహూర్తం ఫిక్స్

- సీఎం రేవంత్ చేతుల మీదుగా రేపు విస్తరణకు శ్రీకారం
- హాజరుకానున్న కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్
- క్యాంపస్ విస్తరణతో మరో 15 వేల మందికి ఉద్యోగాలు
- ఇప్పటికే హైదరాబాద్‌లో ఐదు క్యాంపస్‌లు
- 57 వేల మందికి దక్కిన ఉద్యోగ అవకాశం
- నేటితో ముగియనున్న సీఎం విదేశీ టూర్
- ప్రస్తుతం దక్షిణ కొరియాలో ఉన్న రేవంత్ బృందం
- కొరియాలోని పలు కంపెనీల ప్రతినిధులతో చర్చలు
- తెలంగాణకు రావాల్సిందిగా పలు సంస్థలకు ఆహ్వానాలు

**అమెరికా: ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ హైదరాబాద్ లో తమ కొత్త క్యాంపస్ ను రేపు శంకుస్థాపన చేయనుంది. అమెరికా, దక్షిణ కొరియా పర్యటన ముగించుకొని రేపు హైదరాబాద్ రానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కంపెనీ విస్తరణకు శ్రీకారం చుట్టున్నారు. కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.. ఇది ఇలా ఉంటే రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ. మంత్రి శ్రీధర్‌బాబు అమెరికా పర్యటనలో భాగంగా కాగ్నిజెంట్ కంపెనీ సీఈవో రవికుమార్ తో చర్చలు జరిపారు. న్యూజెర్సీలో ఈనెల 5వ తేదీన రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందానికి అనుగుణంగా కాగ్నిజెంట్ కంపెనీ పది రోజుల్లోనే కొత్త క్యాంపస్ విస్తరణకు శ్రీకారం చుట్టింది. ఒప్పందంలో భాగంగా తమ కంపెనీ విస్తరణ ప్రణాళికలను ముందుగానే వెల్లడించింది.**

హైదరాబాద్ లో 10 లక్షల చదనపు అడుగుల కొత్త క్యాంపస్ నెలకొల్పుతామని, అదనంగా 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త క్యాంపస్ ఫోకస్ చేస్తుంది. ఒప్పందంలో భాగంగా తమ కంపెనీ విస్తరణ ప్రణాళికలను ముందుగానే వెల్లడించింది. హైదరాబాద్‌లో 10 లక్షల చదనపు అడుగుల కొత్త క్యాంపస్ నెలకొల్పుతామని, అదనంగా 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త క్యాంపస్ ఫోకస్ చేస్తుంది. ఇది ఇలా ఉంటే 1994లో చెన్నై కేంద్రంగా ఆవిర్భవించిన కాగ్నిజెంట్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. హైదరాబాద్‌లో 2002 నుంచి కార్యకలాపాలు ప్రారంభించింది. ఐటీ కారిడార్‌లోని వివిధ ప్రాంతాల్లో ఐదు క్యాంపస్‌లు ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు 57 వేల మంది ఉద్యోగులున్నారు. రాష్ట్రంలో ఐటీ రంగంలో అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న రెండో సంస్థగా కాగ్నిజెంట్‌కు పేరుంది. గడిచిన రెండేండ్లలో ఈ కంపెనీ రాష్ట్రంలోని 34 వివిధ విద్యాసంస్థల నుంచి 7500 మంది ఫ్రెషర్లకు ఉద్యోగాలు ఇచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో కాగ్నిజెంట్ కంపనీ తెలంగాణ నుంచి రూ. 7725 కోట్ల ఐటీ ఎగుమతులను నమోదు చేసింది. గడిచిన అయిదేండ్లలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద ఈ కంపెనీ రూ. 22.5 కోట్లతో వివిధ సామాజిక కార్యక్రమాలు చేపట్టింది..

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన మంగళవారంతో ముగియనుంది. ప్రస్తుతం దక్షిణ కొరియాలో ఉన్న ఆయన ఇవ్వాళ రాత్రికి అక్కడ నుంచి బయలు దేరి రేపు హైదరాబాద్ రానున్నారు. కాగా, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికా నుంచి పలువురు పారిశ్రామికవేత్తలు, పరిశ్రమలను ఆకర్షించడంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతమైంది. మూడు రోజుల క్రితం అమెరికా పర్యటన ముగించుకుని కొరియా చేరుకున్న సీఎం రేవంత్ బృందం అక్కడ జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంది.

తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఈ సందర్భంగా సీఎం వివరించారు. సీఎంతో పాటు మంత్రి శ్రీధర్ బాబు, ఖైరతాబాద్ డీసీసీ చీఫ్ రోహిణ్ రెడ్డి ప్రస్తుతం దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఇక.. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో దక్షిణ కొరియా నుంచి పెట్టుబడులు రాబట్టుకున్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ప్రతినిధులు తెలిపారు.

ఇక.. మంగళవారం కూడా కొరియాలోని వివిధ కంపెనీలు , వివిధ వ్యాపార, వాణిజ్య సంఘాల ప్రతినిధులతో సీఎం బృందం చర్చలు జరిపింది. కొరియా టెక్స్‌టైల్ ఫెడరేషన్ చైర్మన్ క్యాక్ సంగ్, వైస్ చైర్మన్ సోయోంగ్ జూతో సహా 25 అగ్రశ్రేణి టెక్స్‌టైల్ కంపెనీల అధినేతలు రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ప్రముఖ ఆటోమోటివ్ కంపెనీ హ్యుందాయ్ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. మెగా పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. భారత్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ (హెచ్‌ఎంఐఈ) ద్వారా మెగా టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడులు పెడతామని కంపెనీ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డి బృందానికి తెలిపారు. కాగా నేటి ఉదయం రేవంత్ టీమ్ ఫ్యూచర్ హ్యాంగంగ్ ప్రాజెక్ట్ హెడ్ క్వార్టర్స్ వెళ్లింది.. అక్కడ వారికి తెలంగాణలో పెట్టుబడుల అవకాశాల గురించి వివరించింది.. వారి నుంచి సానుకూల స్పందన వచ్చునట్లు రేవంత్ టీమ్ ప్రకటించింది.



## విద్యార్థుల మృతి బాధించింది.. చలించిపోయానన్న భట్టి

- ఉప ముఖ్యమంత్రి ఎదుట విద్యార్థుల కంటతడి
- ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సంఘటన తీరుపై ఆరా
- పెద్దాపూర్ గురుకుల విద్యార్థుల తల్లిదండ్రులతో మంత్రి పొన్నంతో కలిసి భేటీ



కరీంనగర్ : జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. విద్యార్థులు మృతి చెందిన సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటానని డిప్యూటీ సీఎం చెప్పారు. ఇటీవల మృతి చెందిన విద్యార్థులు గణాధిత్య, అనిరుధ్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈసంఘటనపై పూర్తి వివరాలు పంపించాలని గురుకుల పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ మహిపాల్ రెడ్డిని విచారించారు. గురుకుల పాఠశాల విద్యార్థుల మృతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ చలించిపోయారు. ప్రతినెలా? లేదా? ప్రశ్నించారు. గురుకుల పాఠశాలలో డ్యూటీ నర్స్ సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , మంత్రి పొన్నం ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు కంట తడిపెట్టారు. తల్లిదండ్రుల బాధ అర్థం చేసుకున్నామని చెప్పారు. వారిని మంత్రులు ఓదార్చారు.

ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ , మేడిపల్లి సత్యం , సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్ట్ 15న చివరి విడత రుణమాఫీ



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. ఆగస్ట్ 15లోగా రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అంతకు నెల రోజుల ముందే ఈ పథకాన్ని అమలు చేసి చూపించారు. రాష్ట్రంలో మొత్తం 32.50 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసేందుకు రూ.31 వేల కోట్ల రుణమాఫీకి ప్రభుత్వం నిధులు కేటాయించి దేశంలోనే కొత్త రికార్డు నెలకొల్పింది. జులై 15వ తేదీన రుణమాఫీ జీవో జారీ చేసిన ప్రభుత్వం.. మూడు రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయటం మొదలు పెట్టింది. జులై 18వ తేదీన మొదటి విడతగా లక్ష రూపాయల స్లాబ్ వరకు రుణమున్న రైతు కుటుంబాలన్నింటికీ ఏకకాలంలో రుణమాఫీ చేసింది. 11,14,412 మంది రైతులకు రూ.6034.97 కోట్లు విడుదల చేసింది. జులై 30వ తేదీన అసెంబ్లీ వేదికగా రెండో విడత రుణమాఫీ కార్యక్రమం అమలు చేసింది. ఒక లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు రుణమున్న రైతు కుటుంబాలను రుణ విముక్తులను చేసింది. దాదాపు 6,40,823 మంది రైతుల ఖాతాల్లో రూ.6190.01 కోట్లు జమ చేసింది. కేవలం 12 రోజుల్లోనే దాదాపు 17.55 లక్షల రైతుల కుటుంబాలకు రూ.12 వేల కోట్లకుపైగా రుణమాఫీ నిధులు

మిగతా 2లో

## బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయం: కెటిఆర్

- ఆగస్ట్ 15న చివరి విడత రుణమాఫీ



హైదరాబాద్: బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. పార్టీ మారిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. బాన్సువాడ నియోజకవర్గాని కి చెందిన పార్టీ శ్రేణులు మంగళవారం నందినగర్ నివాసంలో కెటిఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడారు. పోచారం శ్రీనివాస్ రెడ్డినీ అన్ని రకాలుగా గౌరవించిన పార్టీని వీడటం ఆయనకే నష్టమని చెప్పారు. కార్యకర్తల కష్టం మీద గెలిచి ఆ తర్వాత స్వార్థం కోసం పార్టీని వీడటం కార్యకర్తలను బాధించిందని

మిగతా 2లో

## జిల్లా పోలీసుల పనితీరు భేష్...



## మీ కృషి అనన్య సామాన్యం.. అద్భుతం



శ్రీహరికోట: 'సామాన్యుడు ఈ రోజు ఎంతో ఆనందంతో అనుభవిస్తున్న శాస్త్ర సాంకేతిక రంగాల ప్రతిఫలాల వెనుక జీవితంలో సుఖాలను, సంతోషాలను, బాధలను, బంధాలను సైతం త్యాగం చేసిన ఎందరో శాస్త్రవేత్తల శ్రమ దాగుంది. అంతరిక్ష పరిశోధనలే ప్రాణంగా పని చేస్తున్న ఎందరో మహానుభావుల పరిశ్రమ దాగుంది. దేశం కోసం, జాతి కోసం తమ సొంత కుటుంబాలను, ఇష్టాలను వదులుకొని, అవమానాలు, అవహేళనలను పట్టించుకోకుండా ముందుకు సాగిన గొప్ప వ్యక్తుల సాహస ప్రయాణం దాగుంది. వారే ఈ దేశానికి నిజమైన హీరోలు. ఆ అన్ సంగ్ హీరోలే నాకు నిజ జీవిత హీరోలుగా

మిగతా 2లో

## మహిళా డాక్టర్ హత్య కేసు సిబిఐకి అప్పగించిన కలకత్తా హైకోర్టు

- ఆదిలోనే హత్య కేసు ఎందుకు దాఖలు చేయలేదని ప్రభుత్వానికి ప్రశ్న
- అసహజ మరణం కేసు ఎందుకు నమోదు చేశారని అడిగిన కోర్టు
- కేసు డైరీ సిబిఐకి అప్పగించాలని కోల్‌కతా పోలీసులకు ఆదేశం




కోల్‌కతా: ఒక మహిళా డాక్టర్‌పై హత్యాచారం కేసు దర్యాప్తును సిబిఐకి బదలాయించాలని కలకత్తా హైకోర్టు మంగళవారం ఆదేశించింది. కేసు డైరీని వెంటనే కేంద్ర దర్యాప్తు సంస్థకు అందజేయాలని, అన్ని ఇతర పత్రాలను బుధవారం ఉదయం 10 గంటలకల్లా అప్పగించాలని కోల్‌కతా పోలీసులను కోర్టు ఆదేశించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆర్‌జి కర్ ఆసుపత్రిసెమినార్ హాల్ లోపల హత్యాచారానికి గురైన పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ మృతదేహం శుక్రవారం ఉదయం కనిపించింది. ఈ సందర్భంగా ఒక పౌర వాలంటీర్‌ను శనివారం అరెస్టు చేశారు. సమ్మె విరమించుకోవాలని ఆందోళనకారులైన వైద్యులకుహైకోర్టు విజప్తి చేసింది. వారిది 'పవిత్రమైన బాధ్యత' అని కోర్టు తెలిపింది.

కాగా, ఆదిలోనే హత్య కేసు ఎందుకు దాఖలు చేయలేదని, అసహజ మరణం కేసు ఎందుకు నమోదు చేశారని హైకోర్టు ప్రశ్నించింది. హత్యపై వెంటనే ఫిర్యాదు ఏదీ రానందున అసహజ మరణం కేసు నమోదు చేసినట్లు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ న్యాయవాది చెప్పినప్పుడు ప్రధాన న్యాయమూర్తి టిఎస్ శివజ్ఞానం ఆయనకు ఆ ప్రశ్న వేశారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ మృతదేశం రోడ్డు పక్కన దొరకలేదని ప్రధాన న్యాయమూర్తి సారథ్యంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ గాని, ప్రిన్సిపాల్ గాని ఫిర్యాదు దాఖలు చేసి ఉండవలసిందని బెంచ్ అన్నది. న్యాయమూర్తి హిరణ్మయ్ భట్టాచార్య కూడా బెంచ్‌లో ఉన్నారు. ఈ కేసులో కోర్టు పర్యవేక్షిత దర్యాప్తు కోరుతూ పిజి ట్రైనీ తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. కేసుపై సిబిఐ దర్యాప్తు కోరుతూ పలు

మిగతా 2లో

# మీ కృషి అనన్య సామాన్యం.. అద్భుతం

అనిపిస్తారు. తెరపై కనిపించకుండా దేశం కోసం జీవితాన్ని ధారబోసిన శాస్త్రవేత్తలు నాకు నిజమైన స్ఫూర్తిప్రదాతల'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు.జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష పరిశోధన సంస్థ (షార్) నిర్వహించిన కార్యక్రమంలో పవన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులు, కళాశాల యువత, షార్ శాస్త్రవేత్తలు, సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు.

"ఒక ఫార్ములా కనుక్కోవడానికి కాని, ఓ ప్రయోగం నిర్వహించేందుకుగానీ శాస్త్రవేత్తలు చేసే మేధో మధనం చాలా విలువైనది. ఆలోచనల్లో పడి వారు నిద్ర, ఆహారానికి కూడా ఒక్కోసారి దూరం అవుతారు. దేశానికి ఏదో ఒకటి చేయాలనే తపన, ఏకాగ్రత, శ్రమ అమూల్యమైనవి. వారికి ఈ దేశం ఏమిచ్చినా రుణం తీర్చుకోలేదు. అలాంటి హీరోలు ప్రజలకు తెలియాలి. వారు యువతలో నిరంతరం స్ఫూర్తి నింపాలి. చిన్నచిన్న విషయాలకే తల్లడిల్లిపోయే నేటి తరం యువతరానికి శాస్త్రవేత్తలు స్ఫూర్తిప్రదాతలుగా మారి, దారి చూపాలి. శాస్త్రవేత్తల కష్టాన్ని జాతి గుర్తించాలి. వారికి తగిన గౌరవం ఇవ్వడం, వారి మాటలను జాగ్రత్తగా వినడం ద్వారా కచ్చితంగా అవి గొప్ప జీవితం వైపు తీసుకెళ్తాయి అని పవన్ అన్నారు.

**- బలంగా కోరుకుంటే మంచి తప్పకుండా జరుగుతుంది**

నేను నెల్లూరులో చదువుకున్నాను. నాకు చిన్నప్పటి నుంచి శాస్త్రసాంకేతిక రంగాలు, అంతరిక్ష ప్రయోగాలపై మక్కువ ఉండేది. స్కూల్లో టీచర్ ను పదేపదే దీనిపై ప్రశ్నలు అడిగేవాడిని. టీచర్ నాలో ఉన్న తపనను గుర్తించి నన్ను స్కూలు సైన్స్ టీంలో వేసి ఆర్యభట్ట ఉపగ్రహ ప్రయోగం మీద ఓ నమూనా తయారు చేసి తీసుకురమ్మన్నారు. నానా రకాల పాట్లు పడి.. అప్పుడున్న వనరులతో సాధారణ పేపర్ నమూనా తయారు చేయడానికే నాకు చుక్కలు కనిపించాయి. మరి అంతరిక్షంలోకి ప్రయోగించే, అక్కడ పని చేసే ఉపగ్రహాల తయారీకి, వాటి ప్రయోగానికి శాస్త్రవేత్తలు ఎంత కష్టపడతారో అన్న ఆలోచన నాకు శాస్త్రవేత్తలపై అమితమైన గౌరవాన్ని పెంచింది. వారు చేసే ప్రయోగాలకు జీవితం ధారబోస్తారు. అందరికీ అవసరమయ్యే సాంకేతికను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వారు నిత్యం శ్రమిస్తారన్నారు జన సేనాని.

నెల్లూరులో ఉన్నపుడు శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగిస్తారని తెలుసుకొని ఎప్పుడైనా ఇక్కడకు రావాలని అనుకునేవాడిని. అయితే చాలామంది పోలీసులు ఉంటారు.

శాస్త్రవేత్తలు, అధికారులు ఉండే ఈ ప్రదేశానికి నేను అసలు వెళ్లలేను అనుకునే దగ్గరే నా ఆలోచన ఆగిపోయేది. అనుకోకుండా ఈ రోజు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావడం యాదృచ్ఛికం అయినా, జీవితంలో మంచిని బలంగా కోరుకుంటే అవుతుందనడానికి ఇది నిదర్శనం. అని పవన్ పేర్కొన్నారు.

**- దేశానికి సేవ చేయడం మహద్భాగ్యం**

భారతదేశంలో ఉన్న ఎంతో విలువైన శాస్త్రవేత్తలు, నిపుణులు నిజమైన దేశభక్తులు. వారి మేధస్సులోని అపార జ్ఞానం దేశానికి మాత్రమే చెందాలని భావించడం వారి దేశ భక్తికి నిదర్శనం. సగటు భారతీయుడి విలువలకు తగ్గట్టుగా కడదాకా నా దేశం, నా నేల అనుకునే మనస్తత్వం మనందరినీ కలుపుతుంది. విదేశాలకు వెళ్లే వీలున్నా, అక్కడ హోదా, ధనం వచ్చే అవకాశమున్నా వారంతా దేశానికి కట్టుబడి చేసిన సేవలు, వారి ప్రతిభే దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. 1969 నుంచి ఇంతింతై వటుడింతై అన్నట్లు సాగిన భారతదేశ అంతరిక్ష పరిశోధన ప్రయాణం నేడు ప్రపంచంలోనే మేటిగా మారింది. భారత్ ను బలమైన శక్తిగా నిలపడంలో ఎందరో కనిపించని హీరోల కష్టం దాగుంది. వారి విజ్ఞానం ఉపయోగించుకొని నిరంతరం ముందుకు సాగుతున్న వారికి మాత్రమే విజిల్స్, చప్పట్లు దక్కాలని భావిస్తాను అని వినమ్రంగా తన భావాన్ని చెప్పారు పవన్ కళ్యాణ్.

**- దైవం మానుష రూపేణా**

చిన్నప్పుడు నేను, మా అమ్మ ప్రతిరోజు సాయంత్రం అవగానే ఇంట్లో బల్బు స్విచ్ వేసి దణ్ణం పెట్టుకోవడం గమనించేవాడిని. నువ్వు ఎవరికి మొక్కుతున్నావు అని అడిగితే బల్బు కనిపెట్టిన థామస్ అల్వా ఎడిసన్ కు అని చెప్పేది. అంటే శాస్త్రవేత్తలను, వారి జ్ఞానాన్ని దేవుడిగా నమ్మే సంస్కృతి మనది. పది మందికి మంచి చేసేవారికి దణ్ణం పెట్టడమే భారతీయ ధర్మం. దైవం మానుష రూపేణా అని భావిస్తాం. అలాగే పది మందికీ మంచి చేసే వారిని దేవుడిగా భావిస్తాం. విశ్వం తాలుకా శక్తి నన్ను ఇక్కడ వరకు నడిపించింది అని నమ్ముతాను. మంచి చేయాలని, దేశానికి ఏదో ఇవ్వాలని బలంగా అనుకుంటే కచ్చితంగా అది జరిగి తీరుతుంది. అలాగే దేశం కోసం పనిచేసే ప్రతి శాస్త్రవేత్తకు జాతి రుణ పడి ఉంది. అని అన్నారు .

**- ఎక్కడో ఒక చోట అడుగుపడితేనే..**

ఎక్కడో కేరళలోని తుంబ అనే ప్రాంతంలో చిన్నస్థాయిలో మొదలైన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయాణం నాకు స్ఫూర్తిదాయకం. ఎక్కడో ఒక చోట అడుగుపడితేనే అది వేల మైళ్ల ప్రయాణానికి దారి చూపుతుంది. మన దగ్గర వనరుల్లేవు.. మనకు శక్తి లేదు.. మన వల్ల కాదు అనుకుంటే ఏదీ కాదు. భారతీయ పరిశోధన సంస్థ ఒకేసారి 104 ఉపగ్రహాలను పంపే స్థాయికి ఎదగడం ఓ గొప్ప రికార్డు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఎప్పుడు ఒకటి చెబుతుండేవారు. నీ కల.. నీ ఆశయం పెద్దగా ఉండాలి అని అనేవారు. నిజంగానే ఆయన మాట ఓ స్ఫూర్తి మంత్రం. ఇస్రో పెద్దలు కూడా ఒకప్పుడు అలాగే కలలు కనేవారు. ఈ దేశానికి ఇస్రో అనేది తలమానికం కావాలి%8^% ఇస్రో ప్రపంచంలో అగ్రగామి అంతరిక్ష పరిశోధన సంస్థ కావాలి అనుకునే వారు. అది ఇప్పుడు తీరుతోంది. ఇస్రో పని తీరు వల్ల ప్రపంచ దేశాలన్నీ మన వైపు చేసేలా చేసింది. ఈ దేశం అన్ని రంగాల్లో అగ్రగామి కావాలి%8^% ప్రపంచానికే భారతదేశం దిక్సూచి కావాలని బలంగా ఆకాంక్షిస్తున్నాను అని తెలిపారు పవన్.

**- శ్రీహరికోట.. పర్యావరణహిత ప్రయోగాల వేదిక**

శ్రీహరికోటకు హెలికాప్టర్ లో వస్తున్న సమయంలో పైనుంచి ఈ ప్రయోగ ద్వీపాన్ని చూస్తుంటే ముచ్చటేసింది. పచ్చగా అడవిని తలపించేలా షార్ కనిపించింది. శ్రీహరికోట నిర్మాణం ఓ అద్భుతం. చుట్టూ సముద్రం, మరో పక్క సరస్సు మధ్యలో ఉన్న ద్వీపంలో అంతరిక్ష ప్రయోగశాల నిర్మాణం దేశానికే తలమానికంగా నిర్మించుకోవడం గొప్ప విశేషం.

దీంతోపాటు పర్యావరణానికి ఏ మాత్రం ఇబ్బంది కలగకుండా, అందమైన చెట్లతో అడవిని తలపించే వాతావరణంలో షార్ నిర్వహణ ఓ ప్రకృతి ప్రేమికుడిగా నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. 40 వేల ఎకరాల్లో ఎక్కడా కూడా పర్యావరణాన్ని విధ్వంసం చేసే చర్యలు లేవంటే మామూలు విషయం కాదు. లోపలికి వచ్చాక కూడా పచ్చటి తోరణాల్లా షార్ లో చెట్లు స్వాగతం పలుకున్న తీరు చూసి గొప్పగా ఉంది. జనసేన మూల సిద్ధాంతాల్లో ఒకటైన 'పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం' అనేది ఇక్కడ నాకు కనిపించింది. బయో డైవర్సిటీ, అటవీశాఖ చేస్తున్న కృషి గొప్పగా ఉన్నాయి. అని ప్రశంసించారు ఉప ముఖ్యమంత్రి.

**- అంతరిక్ష పరిశోధనల్లో భారత్ రాజీపడదు**

ఓ హాలివుడ్ సినిమాకు పెట్టిన ఖర్చు కంటే తక్కువ ఖర్చుతో భారతదేశం మార్స్ మిషన్ మంగళ్ యాన్ పూర్తి చేసింది. ప్రపంచంలో ఇంత తక్కువ ఖర్చుతో ప్రపంచంలో అంతరిక్ష పరిశోధనలు చేసిన దేశాలు లేవంటే మామూలు విషయం కాదు. ప్రపంచ దేశాలన్నీ భారతదేశం అతి తక్కువ ఖర్చుతో చేస్తున్న ప్రయోగాల వైపు దృష్టి సారించాయంటే మన ఇస్రో చేస్తున్న కృషి, పని తీరు అసమానం అని చెప్పాలి. ఇస్రోలో పని చేస్తున్న సఫాయి దగ్గర నుంచి ఛైర్మన్ వరకు అంతా ఈ గొప్ప ప్రయాణంలో భాగస్వాములే. 2014లో న్యూయార్క్ టైం పత్రికలో మన అంతరిక్ష పరిశోధన సంస్థ గురించి వ్యంగ్యంగా ఓ కార్టూన్ వచ్చింది. సరిగ్గా దశాబ్దం తర్వాత అదే న్యూయార్క్ టైం పత్రిక.. నడుస్తున్న దేశం అయిన అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా మన ఇస్రోతో కలిసి సంయుక్తంగా పనిచేయడానికి ఆసక్తి చూపిందంటే ఇస్రో ప్రయాణం ఎంత గొప్పగా, పట్టుదలతో సాగిందో అర్థం అవుతంది. అంతరిక్ష పరిశోధనల్లో భారత్ ఎక్కడ రాజీ పడకుండా ప్రయాణం చేస్తుంది. ఇస్రో ప్రయోగాలకు తగిన విధంగా కేంద్రం ఎప్పటికప్పుడు బడ్జెట్ ను పెంచుతోంది. ప్రయోగాలకు అవసరం అయిన నిధులను అందజేస్తోంది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో ఇస్రోకు ఏటా రూ.5,615 కోట్లు మాత్రమే కేటాయిస్తే, అది ఎన్డీయే ప్రభుత్వం లో 2022-23 బడ్జెట్ లో రూ.13,700 కోట్లకు చేరింది. అంటే అంతరిక్ష ప్రయోగాలకు ఇస్తున్న ప్రాధాన్యం గుర్తించవచ్చు. చంద్రయాన్ %-% 2 ప్రయోగం విఫలమైనపుడు నిరాశలో, బాధలో ఉన్న శాస్త్రవేత్తలకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా విచ్చేసి ధైర్యం చెప్పడం, గుండెలకు హత్తుకోవడం గొప్ప విషయం. ఆయన ఇచ్చిన ధైర్యంతోనే ఇస్రో శాస్త్రవేత్తలు ధైర్యంగా ముందడుగు వేసి చంద్రయాన్-3 విజయవంతం చేశారు. అపజయం వచ్చినపుడు శాస్త్రవేత్తలను నిందించకుండా, వారికి బాసటగా నిలిచిన మోదీ ఓదార్పు నన్ను కూడా కదలించింది. అని చెప్పారు పవన్.

**- గగన్ యాన్ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరిస్తుంది**

ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే గగన్ యాన్ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగిన సహాయ సహకారాలు అందిస్తుంది. కేంద్ర ప్రభుత్వం అంతరిక్ష పరిశోధనలను పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తుంది. శాస్త్రవేత్తల కృషి, వారి జ్ఞానం వినియోగించుకొని అద్భుతాలు చేయాలని భావిస్తోంది. భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఇప్పుడు స్పేస్ ఎకానమీ ని సృష్టించే స్థాయికి ఎదిగింది. విదేశాలకు చెందిన ఉపగ్రహాలను మనం కక్ష్యలో ప్రవేశపెట్టడం ద్వారా స్పేస్ ఎకానమీని మనం సాధిస్తున్నాం. మొత్తం గ్లోబల్ స్పేస్ ఎకానమీలో 2 నుంచి 3 శాతం సాధించే స్థాయికి ఇస్రో చేరుకుంది. మన జాతీయ స్థూల జాతీయోత్పత్తిలోనే మంచి అంకెలను ఇస్రో ఇస్తోంది. ఇస్రో సక్సెస్ రేటు కూడా ప్రపంచదేశాల అంతరిక్ష పరిశోధన సంస్థలతో పోల్చుకుంటే చాలా బాగుంది. ఇతర దేశాలు ఇస్రో సేవల కోసం అభ్యర్థిస్తున్నాయి. ఇది ఒక్క రోజులో వచ్చిన విజయం కాదు. ఎన్నో మేధస్సుల కలయిక%8^% ఎందరో మేధావుల పరిశ్రమ. ఇస్రో కేవలం ప్రయోగాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు విజ్ఞాన ప్రదర్శనలు, పోటీలు నిర్వహించడం గొప్ప విషయం. భావి తరాల భవిష్యత్తు దృష్ట్యా పిల్లలను ప్రోత్సహించడం అభినందనీయం. అని అన్నారు ఉప ముఖ్యమంత్రి.

**ఆ రోడ్డు అయిదు రోజుల్లో పూర్తవుతుంది**

బుచ్చినాయుడు కండ్రిగ నుంచి షార్ కు వైపు వచ్చే 17 కిలోమీటర్ల రోడ్డు బాగాలేదని షార్ అధికారులు నా దృష్టికి తెచ్చారు. వెంటనే కలెక్టరుతో మాట్లాడి రోడ్డు పనులు మొదలుపెట్టాం. మరో 5 రోజుల్లో పనులు పూర్తి అవుతాయి. ఇలాంటి పనులను వెంటనే పూర్తి చేసే బాధ్యతను మేం తీసుకుంటాం. ఇస్రో కోసం దేశం నలువైపుల నుంచి వచ్చే శాస్త్రవేత్తలు పనిచేస్తారు. భాష, భావం, భావజాలం వేరైనా అందరి గుండె భారతదేశం అని కొట్టుకుంటుంది. అదే మనందరినీ కలిపి ఉంచుతుందన్నారు.

**- ఇస్రోతో ఎంఓయూ కుదుర్చుకుంటాం**

ఆంధ్రప్రదేశ్ యువతలో అపరిమితమైన జిజ్ఞాస ఉంది. దీన్ని సరైన రీతిలో ముందుకు తీసుకెళ్లే దారి లేక యువత ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. ఇస్రోతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ విషయంలో విజ్ఞాన విషయాలను పంచుకునేందుకు, విలువైన సూచనలు యువతకు అందించే నిమిత్తం ఓ ఎంఓయూ చేసుకోవాలని భావిస్తున్నాను. దీనిపై నేను క్యాబినెట్ లో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాను. భావితరాలకు అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి ఏర్పడాలి. యువతకు అంతరిక్ష పరిశోధనలపై ఉన్న ఆకాంక్షకు తగిన ఉపాధి మార్గం లేదా పరిశోధనల మార్గం చూపేలా ఇస్రో అధికారులు తగిన గైడెన్స్ ఇచ్చేలా మాట్లాడుతాం. గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో ఉండే విద్యార్థులను అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిని పెంచేలా ముందుకు వెళ్లాలి. దీనికి ప్రత్యేకంగా ఓ ఎంఓయూ చేసుకొని సంయుక్తంగా ముందుకు వెళ్లేలా ప్రయత్నాలు చేస్తాం. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ విద్యార్థి, యువతలో అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించేలా చూడటమే ప్రధాన లక్ష్యం. శాస్త్రవేత్తలే ఈ దేశపు బలం. జాతి సంపద. వారు ఈ దేశానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను. భావి భారతం మరిన్ని ప్రయోగాలకు వేదిక కావాలని కోరుకుంటున్నాను" అన్నారు.ఈ కార్యక్రమంలో సతీష్ ధావన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం (షార్) డైరెక్టర్ ఎ.రాజరాజన్, షార్ అసోయేట్ డైరక్టర్స ్యద్ సమీద్, షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, జనరల్ మేనేజర్ శంభు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయం: కెటిఆర్

వాపోయారు. అయితే కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేసిన వాళ్లు ఎంత పెద్ద వాళ్లైనా సరే వదిలిపెట్టేది లేదని, వారికి కచ్చితంగా కార్యకర్తలు బుద్ధి చెబుతారని కెటిఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్‌లోకి వెళ్లిన తర్వాత పోచారం శ్రీనివాస్ రెడ్డిని కనీసం అడిగిన వాళ్లు కూడా లేని దయనీయ పరిస్థితి వచ్చిందని చెప్పారు. గులాబి జెండా మీద గెలిచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ వీడినా.. గ్రామాల్లో పార్టీ కార్యకర్తలంతా బిఆర్ఎస్ పార్టీతోనే ఉన్నారని పార్టీ శ్రేణులు కెటిఆర్‌కు తెలిపారు.

**ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం సంతోషం- : కెటిఆర్**

గురుకుల పాఠశాలల్లో సమస్యలపై ప్రభుత్వం మొత్తానికి స్పందించటంపై కెటిఆర్ స్పందించారు. గత 8 నెలల కాలంలో విషాహారం కారణంగా దాదాపు 500 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలోని బీబీపేట ప్రభుత్వ పాఠశాలలో కలుషిత ఆహారం తిని దాదాపు 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు.

విద్యార్థుల భోజనానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కెటిఆర్ సోమవారం ప్రభుత్వాన్ని కోరగా, మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు జగిత్యాల జిల్లాలోని పెద్దాపూర్ పాఠశాలలను సందర్శించారు.

మంత్రులు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల భోజనం సహా ఇతర అన్ని సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కెటిఆర్ కోరారు. మొన్నటి వరకు కూడా అంతా బాగానే ఉందన్నట్లు మొద్దు నిద్రలో ఉన్న సర్కార్‌ను మేల్కొనేలా చేసినందుకు సంతోషంగా ఉందని చెప్పారు.

**గురుకుల పోస్టులను తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలి**

గురుకుల పోస్టులలో భర్తీ కాకుండా మిగిలిపోతున్నటువంటి పోస్టులను తదుపరి మెరిట్ అభ్యర్థుల్లో భర్తీ చేయాలని కెటిఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగ గురుకుల అభ్యర్థులు మంగళవారం కెటిఆర్‌ను ఆయన నివాసంలో కలసి వారి సమస్యలను వివరించారు.

గురుకుల పోస్టులలో భర్తీ కాకుండా మిగిలిపోతున్నటువంటి పోస్టులను తదుపరి మెరిట్ అభ్యర్థుల్లో భర్తీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని దీని కోసం ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని గురుకుల విద్యార్థులు కెటిఆర్‌ను కోరారు. అభ్యర్థుల విజ్ఞప్తిపై కెటిఆర్ సానుకూలంగా స్పందించారు. గురుకుల విద్యార్థులకు, డిఎస్‌సి విద్యార్థుల తరపున బిఆర్ఎస్ పార్టీగా అభ్యర్థులకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు సిఎస్ శాంతి కుమారికి ఫోన్ చేసి వారి సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# నల్ల చెరువు కబ్జాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్:** హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం ఉప్పల్ నల్లచెరువును పరిశీలించారు. అప్పుడు ఆయనతో పాటు ఎంఎల్ సి తీన్మార్ మల్లన్న, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, వజ్రేశ్ యాదవ్, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ నల్ల చెరువులో కబ్జాలకు పాల్పడితే ఊరుకునేది లేదన్నారు. చెరువులు, నాలాలు, ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆక్రమణలను తొలగించడానికి హైడ్రా పనిచేస్తోందని రంగనాథ్ అన్నారు. కబ్జాలను ఏ మాత్రం సహించబోమని హెచ్చరించారు.

గ్రేటర్‌లో ఆపరేషన్ హైడ్రా కొనసాగుతోంది. మంగళవారం నాడు జీహెచ్ఎంసీలో చెరువులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉప్పల్ నల్లచెరువులో కబ్జాలకు పాల్పడితే సహించేది లేదని హైడ్రా కమిషనర్ హెచ్చరించారు. చెరువు పర్యవేక్షణకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలిపారు.ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సోమవారం కమిషనర్ రంగనాథ్‌ను కలసి ఉప్పల్ నల్ల చెరువులో జరుగుతున్న కబ్జాల గురించి వివరించిన విషయం తెలిసిందే. దీంతో రంగనాథ్ మంగళవారం ఉప్పల్లోని ఎమ్మెల్సీ తీన్ మార్ మల్లన్న, పరమేశ్వర్ రెడ్డి వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డితో కలిసి నల్లచెరువును పరిశీలించారు. నల్ల చెరువులో కబ్జాలను, ఆక్రమణలు పూర్తిగా తొలగించడంతో పాటు చెరువు పరిరక్షణ కోసం హైడ్రా పనిచేస్తుందని తెలిపారు. చెరువులను, నాలాలను, ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కబ్జాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.

మరోవైపు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నందగిరి హిల్స్ హుడా



లేఔట్ ఘటన నేపథ్యంలో మంగళవారం నాడు ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... రంగనాథ్‌కు కొత్తగా వచ్చిన పదవి ఇష్టం లేనట్టుందన్నారు. అందుకే తనపై కేసు పెట్టారని దానం తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించారు. అధికారులు వస్తుంటారు పోతుంటారు.. కానీ తాను మాత్రం లోకల్ అని పేర్కొన్నారు. నందగిరి హిల్స్ హుడా లేఔట్ విషయంలో అధికారులు అతిగా ప్రవర్తిస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ వ్యవహారంలో అధికారులకు ప్రివిలేజ్ నోటీసులు ఇస్తానని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని వార్నింగ్ ఇచ్చారు.అంతేకాదు.. సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. హైడ్రా అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నందగిరి హిల్స్ గురుబ్రహ్మ నగర్‌లో పేదల గుడిసెలు కూల్చివేసే అధికారం వారికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. పార్క్ స్థలం అని చెప్పి ఈవీడీఎం వాళ్లు పెద్ద ప్రహరీ గోడ కడుతున్నారని.. బస్తీ వాసులకు దారి లేకుండా ప్రహరీ గోడ ఎలా కడతారు? అని ప్రశ్నించారు. గోడ కట్టొద్దన్నందుకే ఈవీడీఎం అధికారులు తనపై కేసు పెట్టారని దానం తెలిపారు. హైదరాబాద్‌ను హైడ్రా అధికారులకేమీ రాసివ్వలేదని.. ప్రజా సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తనపై 190 కేసులు ఉన్నాయని.. కేసులకు భయపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు..

## ఆగస్ట్ 15న చివరి విడత రుణమాఫీ

జమ చేయటం తెలంగాణ చరిత్రలో ఇదే మొదటిసారి. ఆగస్ట్ 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మూడో విడత పంట రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. అమెరికా పర్యటన నుంచి వచ్చీ రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా వైరా మండలంలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. మూడో విడతలో రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాలు మాఫీ చేస్తారు. ఆ రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తారు. దీంతో రుణమాఫీలో కీలక ఘట్టం ముగియనుంది. రూ.2 లక్షలకు మించి పంట రుణాలున్న రైతులకు చివరి విడతగా నిధులు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రుణమాఫీ విధి విధానాల్లో ఈ విషయాన్ని ముందుగానే వెల్లడించింది.ం

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి.

**- సదాశివపేట బీసీ సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించిన కలెక్టర్.**

**- విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్.**





**సంగారెడ్డి ఆగస్టు 13 (డైలీ రిపోర్ట్):** సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థుల అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు.మంగళవారం సదాశివపేట పట్టణంలోని బీసీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు రాత్రి భోజనం కోసం తయారుచేసిన వంటలను కలెక్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని వసతి గృహంలో చదివే విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు సమస్యలు త్వరలో పరిష్కారమయ్యేలా చూస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. వసతి గృహంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వసతి గృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై సీజనల్ వ్యాధులు పై అవగాహన కల్పించాలని సిబ్బంది కి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

## కాలం చెల్లిన సీతాపానియాల అమ్మకాలు






**పుల్కల్ ఆగస్టు13 (డైలీ రిపోర్ట్) :** మండల కేంద్రమైన పుల్కాల్ లో ఓ కిరణ షాపులో కాలం చెల్లిన సీత పానీయాలను వినియోగదారులకు విక్రయించారు. పుల్కల్ మండల కేంద్రంలో మంగళవారం నాడు ఓ కిరణ్ షాప్ కి వెళ్లి పల్పి ఆరెంజ్ అనే సీతా పానీయాలను కొనేందుకు అట్టి షాపుకు వెళ్ళాడు పల్పి ఆరంజ్ అనే ఫ్రూట్ జ్యూసులు కొనగా అట్టి బాటిల్ పై కాల పరిమితి జూన్ 28 నా కాల పరిమితి ముగిసింది కాలపరిమితి ముగిసిన సీత పానీయం( పల్పి ఆరెంజ్) తీసుకోగా దానిపై జూన్ 28 కాలం ముగిసిన షాపు యజమాని దర్జాగా విక్రయిస్తున్నాడు. పర్యవేక్షించవలసిన అధికారులు నిమ్మకు నీరత్తినట్లు వ్యవహరించడంతో ఇక్కడి కిరణ్ షాపుల యజమానులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇదొక్కటే కాకుండా ప్రతి వస్తువును కాలం చెల్లిన వస్తువులను అమ్మి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. తమకు అడిగే నాధుడే లేకపోవడంతో విచ్చలవిడిగా పుల్కల్ మండలంలో ప్రతి కిరణా షాపుల్లో కాలం చెల్లిన వస్తువులను విక్రయించి ప్రజల వస్తువులను అధిక ధరలకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైన ఫుడ్ సేఫ్టీ అధికారులు మండలంలోని ప్రతి షాపును తనిఖీలు చేసి ప్రజలకు తగిన న్యాయం చేయాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. లేనియెడల మండల ప్రజల మంత ఏకమై ఫుడ్ ఇన్స్పెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


# జిల్లా పోలీసుల పనితీరు భేష్...

◆ డీజీపీ జితేందర్











**సంగారెడ్డి ఆగస్టు 13( డైలీ రిపోర్ట్):** తెలంగాణ రాష్ట్రంలో క్రైమ్ రేటు పెరగలేదని డీజీపీ డా.జితేందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. పోలీసు కార్యాలయంలో డీజీపీ మొక్కలు నాటారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులతో పోలీసుల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎలాంటి క్రైం రేటు పెరగలేదన్నారు. అదే విధంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో హత్యలు పెరగాయని ప్రచారం చేస్తున్నారని ఇది తప్పన్నారు. గతంలో 48 మర్డర్లు జరిగితే ఇప్పుడు కూడా 48 జరిగాయన్నారు. కానీ ఎక్కువ జరిగినట్లు ప్రచారం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో క్రైం రేటు పెరగకపోయినా కొందరు కావాలని బద్నాం చేస్తున్నారన్నారు. సంగారెడ్డి జిల్లా పోలీసుల పనితీరు బాగుందని డీజీపీ జితేందర్ కితాబిచ్చారు. జిల్లాలో శాంతి భద్రతలు బాగానే ఉన్నాయని, రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. సమీక్షలో నార్కోటిక్స్, సైబర్ క్రైంపై చర్చించామన్నారు. అదే విధంగా ట్రాఫికింగ్ సమస్య తీర్చేందుకు రద్దీ ఉన్న ప్రాంతాలను గుర్తించి స్థానిక వ్యాపారులతో మాట్లాడి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఆర్టీసీ బస్సులు కూడా వారి బస్టాండు వద్ద ఆపి ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలన్నారు. అధిక ట్రాఫిక్ ఉన్న ప్రాంతాలను పోలీసులు గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్, జిల్లాలోని డీఎస్పీలు,వివిధ పోలీసు స్టేషన్లు సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో 100% చేపట్టవలసిన పనులన్నీ పూర్తి చేయాలి: ఎంపీడీవో వెంకయ్య గౌడ్





**శంకర్‌పల్లి: ఆగస్టు 13:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల సమావేశ ప్రాంగణంలో ఎంపీడీవో వెంకయ్య గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం వారంతపు రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాలలో చేపట్టవలసిన పలు కీలక నిర్ణయాలను పంచాయతీ సెక్రటరీలకు మార్గ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమములో డిఎల్పిఓ సతీష్ రెడ్డి పాల్గొని గ్రామాలలో చేపట్టవలసిన అనేక కార్యక్రమాల గురించి వివరంగా తెలిపారు. ముఖ్యంగా గ్రామాలలో 100% మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేయాలని, వీధి కుక్కలను గుర్తించి వాటిని బ్లూ క్రాస్ సంస్థకు అప్పగించాలని, గ్రామాలలో శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, అసెంబ్లీ నియోజకవర్గ ప్రామాణికంగా వార్డుల వారీగా మేడ్జింగ్ ఓట్ల వివరాలను సరిచేయాలని, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల ప్రక్రియలు ఉపయోగించిన ఓటర్ లిస్టులను గమనించాలని ఆయన సూచించారు. ఈ వారాంతపు రివ్యూ సమావేశంలో ఎంపిఓ గిరిరాజ్, ఏపీవో నాగభూషణం, ఏ ఈ పి ఆర్ ప్రభాకర్, పంచాయతి సెక్రటరీలు పాల్గొన్నారు.

# ప్రతి సంవత్సరం తప్పనిసరిగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి: చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్ దామోదర్





**శంకర్‌పల్లి ఆగస్టు 13 (డైలీ రిపోర్ట్):** జీవన శైలిలో మార్పులు చేసుకుని ప్రతి సంవత్సరం తప్పనిసరిగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని చేవెళ్ల డిప్యూటీ డిఎంహెచ్ ఓ డా. దామోదర్ అన్నారు. శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇండియన్ క్యాన్సర్ సొసైటీ మంగళవారం క్యాన్సర్ స్క్రీనింగ్ మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. డిప్యూటీ డిఎంహెచ్ ఓ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో మండలంలోని 135 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ ఓ మాట్లాడుతూ 35 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ప్రతి సంవత్సరం క్యాన్సర్ పరిచయం చేసుకోవాలని సూచించారు. గుట్కాలు ధూమపానాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు ప్రభుత్వం మరియు క్యాన్సర్ సొసైటీ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. నోటి క్యాన్సర్ లక్షణాలు ఉన్న 21 మందిని గుర్తించడం జరిగిందని, రొమ్ము లక్షణాలు ఉన్నవారు ఒకరు ఉన్నారని తెలిపారు. లక్షణాలు ఉన్న వారిని గుర్తించి క్యాన్సర్ ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగిందని డిఎంహెచ్ఓ పేర్కొన్నారు. సమస్యలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చినట్లు డిప్యూటీ డిఎంహెచ్ ఓ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ సిడి ప్రాజెక్టు ఆఫీసర్ రాకేష్, డా. రేవతి, సి హెచ్ ఓ సంతోష, డా. అనూష, ప్రశాంతి, ప్రియ సింగ్, రఘు, శోభ, సిబ్బంది మన్సూర్, సుదర్శన్ రెడ్డి, పీతాంబర గౌడ్ ఉన్నారు.

## కొండకల్ గ్రామ ప్రజలకు 5 లక్షల ప్రమాద బీమా: మాజీ ఎంపిటిసి బద్దం సురేందర్ రెడ్డి



**శంకరపల్లి ఆగస్ట్13: (డైలీ రిపోర్ట్):** 18 నుండి 65 సంవత్సరాల లోపు ఉన్న కొండకల్ గ్రామ ప్రజలకి 5 లక్షల ప్రమాద బీమా ఒక సంవత్సర కాలం పాటు చేయించడానికి నిర్ణయించుకు న్నానని మాజీ ఎంపిటిసి బద్దం సురేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ మంగళవారం మాట్లాడుతూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలనుకునేవారు మీ యొక్క ఆధార్ కార్డు, పాన్ కార్డును తీసుకొని గ్రామ పంచాయితీకి రావాలని కోరారు. ఆగస్టు 14 వ తారీకు నుండి ఆగస్టు 18 వ తారీకు వరకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని వియోగించుకోవాలని బద్దం సురేందర్ రెడ్డి పేర్కొన్నారు.


## ప్రసార సేవల బిల్లు ముసాయిదా రూపకల్పనకు కృషి: కేంద్రం

**న్యూఢిల్లీ :** ప్రసార సేవల బిల్లు కొత్త ముసాయిదా రూపకల్పనకు ముందు మరింతగా సంప్రదింపులు జరపగలమని ప్రభుత్వం ప్రకటించింది. ప్రతిపాదిత చట్టంలో సామాజిక, డిజిటల్ మీడియాపై ఆంక్షలు విధిస్తుండడం గురించి కొన్ని వర్గాల్లో ఆందోళనలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ వివరణ ఇచ్చింది. కొన్ని భాగస్వామ్య వర్గాలలో ప్రభుత్వం పంపిణీ చేసిన ముసాయిదా ప్రసార సేవల బిల్లుపై డిజిపబ్, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా వంటి మీడియా సంస్థల నుంచి విమర్శలు వచ్చాయి. ఈ అంశంపై డిజిటల్ మీడియా సంస్థలను, పౌర సమాజ సంస్థలను సంప్రదించలేదని అవి విమర్శించాయి.'ముసాయిదా బిల్లుపై భాగస్వామ్య వర్గాలతో మంత్రిత్వశాఖ వరుసగా సంప్రదింపులు సాగిస్తోంది. అక్టోబర్ 15 వరకు వ్యాఖ్యలు/సూచనలు కోరేందుకు మరింత సమయంఇవ్వడమైంది' అని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ 'ఎక్స్' పోస్ట్‌లో తెలియజేసింది. సమగ్ర సంప్రదింపుల అనంతరం సరికొత్త ముసాయిదా వెలువరించగలం' అని మంత్రిత్వశాఖ తెలిపింది. ముసాయిదా ప్రసార సేవల (క్రమబద్ధీకరణ) బిల్లు రూపకల్పనకు తాము కృషి చేస్తున్నట్లు మంత్రిత్వశాఖ తెలియజేసింది.

## ఘనంగా ఎరవెల్లి జగన్ జన్మదిన వేడుకలు

◆ (హాజరైన ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్)





**తెలంగాణ ఆగస్టు 13(డైలీ రిపోర్ట్):** డిప్లొమా స్టూడెంట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, JNTUH యూనివర్సిటీ విద్యార్థి నేత, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు ఎరవెల్లి జగన్ జన్మదిన వేడుకలను రాష్ట్ర రాజదానిలోని జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం లో అభిమానులు నాయకులు అట్టహాసంగా నిర్వహించారు. ఇట్టి వేడుకలకు సినీ ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్, యంగ్ ఫైట్ మాస్టర్ రాహుల్ లు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. చిన్నప్పటి నుండే ఎన్నో కష్టాలను ఎదుర్కొని, అణిచివేత నుండి ఎగసిన కొత్త యువ నాయకుడు జగన్ అని, రానున్న రోజుల్లో యువతకు జగనే ఆదర్శం కావాలని రామ్ లక్ష్మణ్ లు ఆకాంక్షించారు. ఎరవెల్లి జగన్ జన్మదిన పురస్కరించుకొని ఎరవెల్లి జగన్ అభిమానులు వివిధ ప్రాంతాల్లో అన్నదానాలు చేసి, పేదల ఆకలి తీర్చారు.

## కాలువలను చెరువులను నాశనం పట్టిస్తున్నారని రైతుల ఆగ్రహం

◆ రాళ్లకత్వ లో అసైన్డ్ భూముల్లో మైనింగ్ పనులు వెంటనే నిలిపివేయాలి

◆ రైతులను, మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి





**సంగారెడ్డి ఆగస్టు 13, (డైలీ రిపోర్ట్):** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం రాళ్లకత్వ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 286 రైతులకు ఇచ్చినటువంటి అసైన్డ్ భూమిలో కొంతమంది యజమానులు మైనింగ్ యూనిట్లకు పర్మిషన్లు తీసుకొచ్చి పనులు కొనసాగిస్తున్నారు ప్రధాన అంశం ఏమిటంటే మైనింగ్ అధికారులు పర్మిషన్ ఇచ్చిన స్థలం లో మొండికుంట రాళ్లకత్వ గ్రామం పెద్ద చెరువుకు ప్రధాన కాలువ ప్రభుత్వం చే నిర్మించబడిన చెక్ డాం ముఖ్యంగా గతంలో హరిజనలకు అంటే దళితులకు కేటాయించిన ఇండ్ల స్థలము దళితులు అసైన్డ్ భూముల్లో పర్మిషన్ ఇవ్వడం జరిగింది కాలువలను చెరువులను కూడిపి వేస్తున్నారని రైతులు మత్స్యకార కుటుంబాలు తీవ్రంగా మండిపడుతున్నారు.

గతంలో నెలకొల్పిన ప్రస్తుతం కొనసాగుతున్న క్వారీ బ్లాస్టింగ్ ల వల్ల అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో కొత్త క్రిషన్లకు అనుమతులు ఇచ్చారని తెలుసుకున్న గ్రామ ప్రజలు సంబంధిత అధికారులకు గ్రామస్థాయి మండల రెవెన్యూ ఇరిగేషన్ ఏవి ఇరిగేషన్ డియి ఆర్డిఓ కలెక్టర్ సంబంధిత అధికారులకు చెరువుకుంటల పైన పూర్తి నివేదికను సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోక పనులు కొనసాగుతున్నాయి స్థానిక రైతులు అడ్డుకుంటుంటే క్వారీ క్రషరూ యజమానులతో కుమ్మక్కై పోలీసులతో బెదిరింపులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానిక రైతులు మండిపడుతున్నారు.

ప్రభుత్వ యంత్రాంగాలకు ప్రభుత్వ వివిధ శాఖలకు ఎన్ని వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోవడంలేదని తీవ్రంగా రాళ్లకత్వ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రాబోవు రోజుల్లో ఇలాగే పనులు కొనసాగిస్తే చుట్టుపక్కల గ్రామ ప్రజలను రైతు సంఘాలను యువజన సంఘాలను మహిళా సంఘాలు దళిత సంఘాలు అన్ని వర్గాలను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాడడానికి సిద్ధంగా ఉన్నామని రాళ్లకత్వ గ్రామ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## దేశంలోనే అతిపెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్- ఏ బి వి పి...

◆ శంషాబాద్ జిల్లా కన్వీనర్ చాకలి మహేష్.



**శంకర్ పల్లిబీ ఆగస్టు13:(డైలీ రిపోర్ట్) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏ బి బిప నగర కమిటీ శంకర్ పల్లి కేంద్రంలో మంగళవారం ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శంషాబాద్ జిల్లా కన్వీనర్ చాకలి మహేష్ పాల్గొని మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఏబీవీపీ అని సంస్థలో పనిచేసే ప్రతి ఒక్క కార్యకర్త నిస్వార్థంగా సమాజం కోసం పనిచేస్తూ, విద్యారంగ సమస్యల పట్ల అనేక ఉద్యమాలు చేస్తూ, విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తూ, సమాజ హితం కోసం, దేశ హితం కోసం పనిచేసే సంస్థ ఏబీవీపీ అని అన్నారు. సంస్థలో ఎవరికైనా ఒకే స్థానం ఉంటుందని, ప్రతి ఒక్కరూ సమాజం కోసం పనిచేయాలని కోరారు. అనంతరం 2024 -2025 సంవత్సర నూతన శంకర్ పల్లి నగర అధ్యక్షులు గా శ్రీ రవీందర్ సార్,నగర కార్యదర్శి గా చెవ్వ నితిన్ శంకర్ పల్లి నగర ఉపాధ్యక్షులుగా వడ్ల శివ చారి,ఎస్ హరీశ్వర్ రెడ్డి,ఎస్ వంశీ,ఆర్ కార్తీక్ నగర సంయుక్త కార్యదర్శులుగా శివ శంకర్ యాదవ్,దేవేందర్ నాయక్, చక్రపాండు,శివతేజ ఎస్ ఎఫ్ డి కన్వీనర్ గా శ్రీధర్,రాహుల్, ఎస్ ఎఫ్ డి కో-కన్వీనర్ గా ఆనంద్, ఎస్ ఎఫ్ ఎస్ కన్వీనర్ గా శ్రీశైలం, ఎస్ ఎఫ్ ఎస్ కో-కన్వీనర్ గా జశ్వంత్ ఆర్ కే యం కన్వీనర్ గా దివ్య సాయి, సోషల్ మీడియా కన్వీనర్ గా సందీప్ చారి,నగర కార్యవర్గ సభ్యులుగా నాగేష్,వినయ్, సుధాకర్, వివేక్ రాజ్ తదితరులు ఎన్నికయ్యారు.

## రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయరాదు: చేవెళ్ల ట్రాఫిక్ సిఐ వెంకటేశం



**శంకర్‌పల్లి ఆగస్టు 13(డైలీ రిపోర్ట్):** రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయరాదని చేవెళ్ల ట్రాఫిక్ సిఐ వెంకటేశం అన్నారు. మంగళవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని యూనియన్ బ్యాంకు వద్ద ఉన్న పార్కింగ్ సమస్య, రోడ్లపై వాహనాల పార్కింగ్, తోపుడుబండ్ల నిర్వాహకులతో సీఐ వెంకటేశం మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. యూటర్న్ ల వద్ద వాహనదారులు వేగాన్ని అదుపులో ఉంచుకోవాలని ఆయన కోరారు. రోజు వారి వ్యాపారం చేసుకునే పండ్ల వ్యాపారులు రోడ్డుపైకి వస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సురేందర్, కానిస్టేబుల్స్ రామకృష్ణ, జంగయ్య ఉన్నారు.

## రుణమాఫీ డబ్బులు వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలి.

- రుణమాఫీ డబ్బులు జమ చేయడంలో నిర్లక్ష్యం తగదు.
- రెన్యువల్ చేసిన రుణాలు కొత్త రుణాల వివరాలు అందజేయాలి.
- రుణమాఫీ డబ్బులు జమ విషయంలో ఫిర్యాదులు వస్తే సహించేది లేదు.
- మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాలకు విరివిగా రుణాలు అందజేయాలి.
- బ్యాంకర్లు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ క్రాంతి వల్లూరు సమీక్ష.



**సంగారెడ్డి ఆగస్టు 13,(డైలీ రిపోర్ట్): :** రుణమాఫీ డబ్బులు వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ లో రైతు రుణమాఫీ ,మహిళ శక్తి పథకాలపై బ్యాంకర్స్ వ్యవసాయ అధికారులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన రైతు రుణమాఫీ, డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసి రైతులకు నగదు రూపంలో డబ్బులు అందజేయాలని బ్యాంకర్లకు ఆదేశించారు.

జిల్లాలోని అన్ని రైతువేదికలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి రైతుల నుండి డాక్యుమెంట్స్ స్వీకరించాలని, రుణాలను రెన్యువల్ చేసి రైతులకు నగదు రూపంలో డబ్బులు అందించాలన్నారు. రుణమాఫీ డబ్బులు అందజేయడం రుణాలు రెన్యువల్ చేయడం లో ఎక్కువ పెండింగ్ ఉన్న డివిజన్లో త్వరితగతిన నగదు ను రైతు ఖాతాలలో జమ చేయాలన్నారు. కొత్త లోన్ వివరాలు,పాత లోన్ రెన్యువల్ వివరాలు బ్యాంకుల వారీగా అందించాలన్నారు. రుణమాఫీ డబ్బులు రైతులు ఖాతాలో జమ చేయడం ఆలస్యం అవ్వడంతో రైతుల నుండి రైతు సంఘాల నుండి ఫిర్యాదులు అందుతున్నాయి, అలాంటి సమస్యలు ఇకముందు రాకుండా రైతులు ఖాతాలో నగదు జమ చేయాలన్నారు.రైతులను బ్యాంకుల చుట్టూ తిప్పుకోవద్దన్నారు.

మహిళా శక్తి కేంద్రాలు ఏర్పాటుకు బ్యాంకర్లు మహిళా సంఘాలకు ఆర్థికంగా చేయూతనందించాలన్నారు. 2024-25 సంవత్సరానికి లక్ష్యం రూ " 927.27 కోట్ల కు గాను ఈనెల ఆగస్టు నాటికి రూ ' 345.47 కోట్లు , పూర్తి చేయడం జరుగుతుందని , ఇప్పటివరకు రూ ' 309 కోట్ల రూపాయల గ్రౌండ్ పూర్తి చేయడం జరిగిందన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగ జిల్లాలో 13 రకాల కార్యక్రమాల ద్వారా మహిళా సంఘాల సభ్యులకు లబ్ధి చేకూర్చే విధంగా సుస్థిరమైన జీవనోపాదికి ప్రణాళికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కోసం బ్యాంకారులు తమ వంతు కృషి చేయాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళా సంఘాల సభ్యులు శాశ్వత ఉపాధి పొందేల జిల్లాలో పథకాలు రూపొందించినట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన బ్యాంకు లింకేజీ రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, జిల్లా వ్యవసాయ అధికారి నరసింహ, ఎల్ డి ఎం గోపాల్ రెడ్డి, జడ్పిసిఓ జానకి రెడ్డి, మెప్మా గీత, డిప్యూటీ డిఆర్డిఓ డిప్యూటీ సంగారెడ్డిగా డిప్యూటీ డిఆర్డిఓ జంగారెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి జగదీష్, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ చారి, సంబంధిత బ్యాంక్ అధికారులు, వ్యవసాయ అధికారులు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.